క్లుప్తంగా

వాహనాల తనిఖీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): వాహన చోదకులంతా తప్పకుండా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ సీఐ కె.కిషోర్‌బాబు హెచ్చరించారు. స్థానిక ముత్యాలంపాడు ప్రభుత్వ ముద్రణాలయం వద్ద శుక్రవారం సాయంత్రం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్‌ను ఏర్పాటు చేసిన బుల్లెట్‌ను సీజ్ చేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ఓ పోలీసు కానిస్టేబుల్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న పలువురికి జరిమానా విధించారు.
ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హెల్మెట్ పోలీసుల కోసం కాకుండా ప్రాణ రక్షణ కోసమని తెలుసుకుని వినియోగించాలని వాహనచోదకులకు సూచించారు.

క్వార్టర్ ఫైనల్స్‌కి ఆంధ్రా కబడ్డీ జట్టు



విజయవాడస్పోర్ట్స్: 50వ జాతీయ జూనియర్ కబడ్డీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టు వరుస విజయాలను నమోదు చేస్తోంది. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో ఈనెల 8వతేదీ నుంచి నిర్వహిస్తున్న ఈ పోటీల్లో లీగ్ మ్యాచ్‌ల్లో మనజట్టు, ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ, బీహార్ రాష్ట్రాలను ఓడించి ప్రీ క్వార్టర్స్‌కు చేరిన విషయం తెలిసిందే. ప్రీ క్వార్టర్స్ విభాగంలో శుక్రవారం హిమాచల్‌ప్రదేశ్‌ను 11పాయింట్ల తేడాతో ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరింది. క్వార్టర్ ఫైనల్స్‌లో రాజస్థాన్ జట్టుతో శనివారం మనరాష్ట్ర జట్టు తలపడుతుందని ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వై.శ్రీకాంత్ తెలిపారు.

సీపీని కలిసిన ఉద్యోగోన్నతి పొందిన పోలీసులు



భవానీపురం(విజయవాడపశ్చిమ): జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగోన్నతి పొందిన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, హెడ్ కానిస్టేబుళ్లు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సర్వీస్ ప్రాతిపదికన అర్హత కలిగిన ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా, ముగ్గురు కానిస్టేబుళ్లు హెడ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి పొందారు. సీపీని కలిసినవారిలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు పి.సత్యనారాయణ (2243), జె.ప్రమీలా రాణి (642), పి.వరలక్ష్మి (141), హెడ్ కానిస్టేబుళ్లలో డి.నాగసురేష్ (2189), పి.ప్రసన్న (670), ఎం.సురేష్ (2178) ఉన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు వారందరినీ అభినందించారు.

ఎస్ఆర్ఆర్‌లో విశ్వహిందీ దినోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విశ్వ హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హిందీ బీఈడీ కళాశాల అధ్యాపకులు శ్రీరామ్ శ్రీనివాసులు మాట్లాడుతూ హిందీభాష ప్రాధాన్యతను తెలియజేశారు. హిందీ నేర్చుకుంటే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో అనువాదకులుగా, బ్యాంకుల్లో రాజభాష హిందీ అధికారులుగాను ఉద్యోగావకాశాలు లభిస్తాయని వివరించారు. విద్యార్థులు నిర్వహించిన ఆయా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, హిందీ విభాగాధిపతి భానుప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓపెన్ ఫోరం ద్వారా టౌన్ ప్లానింగ్ సమస్యలకు పరిష్కారం



పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగంలో పేరుకుపోయిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలోని ఆయా జోనల్ కార్యాలయాల్లో ప్లాన్‌ల మంజూరు, ఎల్ఆర్ఎస్, డీపీఎంఎస్ వంటి సమస్యలపై ప్రజలకు సందేహాలను అధికారులు నివృత్తి చేశారని పేర్కొన్నారు. ఈ ఫోరంలో డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీప్లానర్లు రాంబాబు, మోహన్ బాబు, ఇతర టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న పందెం బరులు

- కూటమి నేతల ఫొటోలతో ఫ్లెక్సీలు
- సంబరాల పేరుతో స్వాగత తోరణాలు
- జనం జేబులు గుల్ల చేసేందుకు సన్నాహాలు

అటువైపు కన్నెత్తి కూడా చూడని రెవెన్యూ, పోలీసు అధికారులు



అంబాపురం గ్రామపరిధి పైపులరోడ్డు వద్ద ఏర్పాటు చేసిన కోడిపందేల బరి

పాయకాపురం(విజయవాడరూరల్): సంక్రాంతి పండుగకు పందెం కోళ్ల కాలు దువ్వుతుండగా, పందేల నిర్వహణకు కూటమి నాయకులు బరులు సిద్ధంచేస్తున్నారు. కూటమి నాయకులు పండగను అడ్డంపెట్టుకుని కోడిపందేల పేరుతో జనం జేబులకు చిల్లుపెట్టేందుకు పోటీలుపడి మరీ బరులు ఏర్పాటు చేస్తున్నారు. కోడిపందాల నిర్వాహణ కోసం పైపులరోడ్డు సమీపంలోని అంబాపురం గ్రామపంచాయతీ పరిధిలోగల ఖాళీస్థలాలను చదును చేసి సర్వే రాళ్ల ఏర్పాటు చేశారు. చుట్టూతా ఐరన్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి మూడు బరులను సిద్ధం చేశారు.

ఫ్లెక్సీల ఏర్పాటుతో అధికారముద్ర...

రెండు మూడు రోజులుగా అధికార కూటమి నాయకులు ఈ పందెం బరులను సిద్ధం చేస్తూ ఆప్రాంతంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, సెంట్రల్ ఎమ్మెల్యే, విప్ బోండా ఉమామహేశ్వరరావు, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) ఫోటోలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు.
తమ బరులకు అధికార కూటమి పెద్దల మద్దతు ఉందని చెప్పుకునే ప్రయత్నంలో భాగంగానే ఇలా ఆయా నేతల ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తుండటం గమనార్హం. తద్వారా అధికారయంత్రాంగానికి కూడా పరోక్ష సంకేతాలు పంపిస్తున్నారు. కోడిపందేల బరుల ఏర్పాటుకు సంబంధించిన సమాచారం రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. రెండు రోజుల కిందట విజయవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో రూరల్ మండల తహసీల్దార్ బి.సుగుణ, టూటౌన్ సీఐ సీహెచ్ కొండలరావు మాట్లాడుతూ కోడిపందేలు నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. బరులు ఏర్పాటు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఇలా అధికారులు జారీచేసిన హెచ్చరికలు ఆచరణలో మాత్రం ప్రకటనలకే పరిమితమయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఓ వైపు యథేచ్ఛగా పందెం బరులు సిద్ధమవుతుండగా, అవేమి తమకు కనిపించడం లేదన్నట్లుగా రెవెన్యూ, పోలీసు అధికారులు కేవలం ప్రకటనలకే పరిమితమవుతుండటం గమనార్హం.

కోడిపందెం బరికి రూ.10లక్షలు?..

ఈ ప్రాంతంల ఏర్పాటు చేస్తున్న ఒక్కో కోడిపందెం బరికి పదిలక్షల రూపాయలు వసూలు చేసేలా అధికారపార్టీకి చెందిన నేతలు రేటు నిర్ణయించినట్లు సమాచారం. పందెం బరిలో కోడిపందెంతోపాటు పేకాట, గుండాట, బోర్డు ఆటలతోపాటు పార్కింగ్, పలావ్, బిర్యానీ విక్రయశాలల నిర్వాహకుల నుంచి కూడా భారీగా వసూళ్లకు తెరలేపారు.



బరుల వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

భోగి, సంక్రాంతి, కనుమ పండుగలకు సంబంధించి మొత్తం మూడు రోజులకుగాను మూడు బరులపై కోటి రూపాయలకుపైగా జూదం నడిచే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇలా మొత్తమ్మీద అధికార కూటమి నేతల కనుసన్నల్లోనే అంబాపురం ప్రాంతంలో పందెం బరులు యథేచ్ఛగా ఏర్పాటవుతుండగా, నిలువరించాల్సిన ఆయాశాఖల అధికారయంత్రాంగం ప్రకటనలకే పరిమితమవుతూ బోద్యం చూస్తోంది.

వైఎస్సార్ సీపీ పటిష్టతకు కృషి చేయాలి : మల్లాది

మధురానగర్(విజయవాడసెంట్రల్): పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని, అందరూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా నియమితులైన దుర్గాపురానకు చెందిన మట్టా శేషునారాయణ రావు శుక్రవారం మల్లాది విష్ణును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో తనకు అవకాశం కల్పించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి, మల్లాది విష్ణుకు శేషునారాయణరావు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మల్లాది విష్ణు శాలువాతో నారాయణరావును సత్కరించారు



మట్టా శేషునారాయణను సత్కరిస్తున్న మల్లాది విష్ణు

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభల శ్రీనివాసరావు, బంకా వెకంటేష్, కె.రవి, వెన్నం రత్నారావు, ఎం.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానరగ్ గౌతమ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. తెలుగు సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా భోగిమంటలు, కోడిపందాలు, ధాన్యం నూర్పిడి, పాల పొంగలి, చిన్నారులకు భోగి పండ్లు, బొమ్మలకొలువు నిర్వహించారు. చిన్నారులు గాలిపటాలు ఎగరవేశారు. పాఠశాల కరస్పాండెంట్ నెక్కంటి ప్రసాద్ సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

శారద కాలేజీలో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్థానిక శారదా కళాశాలలో సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంబరాల్లో భాగంగా భోగి మంటలు వేశారు. భోగి మంటల చుట్టు ప్రదక్షిణలు చేస్తూ పాటలు పాడారు. కళాశాలను పూలు, చెరుకు గడలతో అందంగా అలంకరించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు చక్కటి రంగులతో ముగ్గులను అందంగా తీర్చిదిద్దారు. కళాశాల అధ్యాపక బృందం సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఆయా పోటీల విజేతలకు శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ఈసీ మెంబర్ అర్చన బహుమతులు అందజేశారు. అర్చన మాట్లాడుతూ విద్యతోపాటు సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎల్ శ్రీధర్, కరస్పాండెంట్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గాలిపటాలు ఎగురవేస్తున్న చిన్నారులు



శారదా కళాశాల ఆవరణలో నిర్వహించిన పోటీల్లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

డీసిల్టింగ్ ప్రక్రియను ప్రారంభించాలి

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని అన్ని ప్రాంతాల్లో డీసిల్టింగ్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం, ఈట్ స్ట్రీట్, ఏలూరు రోడ్డు, మాచవరం, ఈఎస్ఐ హాస్పిటల్, క్రీస్తురాజుపురం, ఏఎస్ రామారావు రోడ్డు, ఎస్సీ కాలనీ, లయోల కాలేజీ రోడ్డు, మధు చౌక్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో భారీ వర్షాలు కురిసినప్పుడు 72 ప్రాంతాల్లో నీరు నిలుస్తోందని అధికారులు గుర్తించారని, ఆయా ప్రాంతాల్లోని డ్రెయిన్లలో నిరంతరం డీసిల్టింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రధాన ఔవుట్‌ఫాల్ డ్రెయిన్లలో కలిసే మురుగు కాలువలను నిరంతరం పర్యవేక్షిస్తూ డీసిల్టింగ్ చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఏలూరు రోడ్డు, మాచవరం ప్రాంతంలో భూగర్భ డ్రెయిన్ పొంగుతోందని, ఆ సమస్యను త్వరగా పరిష్కరించాలని పేర్కొన్నారు. క్రీస్తు రాజపురం ఎస్సీ కాలనీలో ఎప్పటి నుంచో నిలిచి ఉన్న పాత ద్విచక్ర, నాలుగు చక్ర వాహనాల వల్ల ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీస్‌ల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద పాడైపోయిన కల్వర్ట్‌ను గమనించి వెంటనే మరమతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మధు చౌక్ సెంటర్ వద్ద గుహల ముందు డ్రెయిన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ సమన్వయంతో రోడ్లపైనున్న నిర్మాణ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ ప్రభుదాస్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు



ఎస్ఆర్ఆర్‌లో రంగవల్లులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రంగవల్లులు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని లయన్స్ క్లబ్ గవర్నర్ శ్రీకాంతి అన్నారు. స్థానిక ముత్యాలంపాడు సిటీ వైడ్ ప్రభాస్‌ఫ్యాన్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు డి.మురళీకృష్ణంరాజు ఆధ్వర్యాన శుక్రవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొని అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. నాయకులు పీ అప్పలరాజు, నున్న నాగేశ్వరరావు, బాబ్జీ, సుబ్బారావు పాల్గొని ప్రసంగించారు.

ఎస్ఆర్ఆర్‌లో. .

సంక్రాంతి సంబరాలలో భాగంగా మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రంగవల్లులు, సంక్రాంతి విశిష్టతను వివరించారు. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేసి అభినందించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో భాగస్వాములు కావాలి

విజయవాడ కల్చరల్/ మధురానగర్: సాంస్కృతిక కళాసంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ముక్కోటిని పురస్కరించుకుని జయహో ఫౌండేషన్, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని బీఆర్‌టీఎస్ రోడ్డు, దుర్గాపురం, రైల్వేస్టేషన్, సంగీత కళాశాల తదితర ప్రాంతాల్లో నిరాశ్రయులకు దుప్పట్లు, ఆహార పొట్లాలు, పేద కళాకారులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు.న్యాయవాది వేముల హజరత్తయ్యగుప్తా మాట్లాడుతూ కళాకారులకు సేవలను నిరంతరం సాగించాలని సూచించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సీహెచ్ లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ 2012 నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు రామకృష్ణ, మార్కండేయులు, వీణా మాధవి తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులను గౌతమ్‌రెడ్డి సత్కరించారు. అదేవిధంగా ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో గౌతమ్‌రెడ్డి ఆధ్వర్యంలో అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గౌతంరెడ్డి మాట్లాడుతూ తాము చేస్తున్న సేవాకార్యక్రమాలకు సహకరిస్తున్న భక్తులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు ఆలయ కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న గౌతమ్‌రెడ్డి, సీహెచ్ లక్ష్మీరెడ్డి, న్యాయవాది వేముల హజరత్తయ్యగుప్తా

ప్రతిభకు పదును పెట్టాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమలోని ప్రతిభకు పదును పెట్టినప్పుడు మంచి విజయాలను అందుకుంటారని జిల్లా విద్యాశాఖాధికారి యువీ సుబ్బారావు అన్నారు. దక్షిణ భారత జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్–2025 కు ఎంపికైన జిల్లా విద్యార్థులను ఆయన తన కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. సుబ్బారావు మాట్లాడుతూ విజయవాడ నగరంలో ఇటీవల జరిగిన సైన్స్ ఫెయిర్‌లో 156 ప్రాజెక్టులు పాల్గొనగా వాటిలో నుంచి 35 ప్రాజెక్టులు పుదుచ్చేరిలో 20న జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాయని చెప్పారు. అందులో ఎన్టీఆర్ జిల్లా తరఫున ఒక స్టూడెంట్ విభాగం నుంచి గంపలగూడెం మోడల్ స్కూల్ విద్యార్థి సుదక్ష, జగ్గయ్యపేట బాయ్స్ హైస్కూలు నుంచి ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. మోడల్ స్కూల్ తరఫున రోలింగ్ రోబో ప్రాజెక్టు, జగ్గయ్యపేట జిల్లా పరిషత్తు హైస్కూలు తరఫున వరదలో వచ్చినప్పుడు బ్యారేజ్ అనేవి ఏ విధంగా నిర్మించబడాలి... వాహనాలు మనుషులను ఏవిధంగా కాపాడాలి అనే ప్రాజెక్టు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మార్మోగిన గోవింద నామ స్మరణ



శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో దర్శనమిస్తున్న స్వామివారు



ముత్యాలంపాడు శ్రీకోదండ రామాలయంలో



దావు బుచ్చియ్య కాలనీ ఆలయంలో



ముత్యాలంపాడులో పూజలు చేస్తున్న భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం అన్ని వైష్ణవాలయాల్లో గోవింద నామ స్మరణ మార్మోగింది. మధురానగర్, ముత్యాలంపాడు, మాచవరం, దావుబుచ్చయ్యకాలనీ, అయోధ్యనగర్, రామకృష్ణాపురంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముత్యాలంపాడు శ్రీకోదండ రామాలయంలో స్వామివారికి విశేషంగా తులసీదళాలతో అర్చనలు జరిగాయి. శ్రీగోదారంగనాథ స్వామివార్లను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయి బాబా మందిరంలో శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన ధునుర్మాసోత్సవాల్లో భాగంగా వైకుంఠ ఏకాదశి పూజలు జరిగాయి. తెల్లవారుజామున నగర సంకీర్తన నిర్వహించారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి, పారాయణ మండలి కన్వీనర్ మండలపర్తి సత శ్రీహరి పాల్గొన్నారు. మధురానగర్ మెయిన్‌రోడ్డులోని ఓంకార క్షేత్రం శ్రీభగవాన్ షిరిడీ సాయిబాబా మందిరంలో వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. దత్తసాయి శివకామేశ్వరి శ్రీధర్మపరిషత్ మహా సంస్థానం ఆధ్వర్యాన వైకుంఠ ఏకాదశి పూజలు జరిగాయి. సాయంత్రం స్వామివారి కళ్యాణం కనులపండువగా జరిగింది. మాచవరం స్వయంభూ శ్రీదాసాంజనేయస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాధశి పూజలు జరిగాయి. భక్తులు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి ఏర్పాట్లను పర్యవేక్షించారు. దావు బుచ్చయ్యకాలనీ శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. స్వామిని తులసీదళాలతో అర్చించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త అంగలూరు పద్మావతి పర్యవేక్షించారు.



భక్తులకు దర్శనమిస్తున్న శ్రీరాధాకృష్ణులు

లెనిన్ సెంటర్ సాయిబాబా మందిరంలో

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్థానిక లెనిన్ సెంటర్‌లోని ఓం షిర్డీ సాయిబాబా నాగసాయిబాబా మందిరంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. సీతారాముల చిత్రపటాలకు పూజలు చేశారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఏలూరు రోడ్డులోని రామాలయం, బావాజీపేటలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉత్తర ద్వారం నుంచి స్వామివారి దర్శనం

పాయకాపురం(విజయవాడరూరల్): ముక్కోటి ఏకాదశి సందర్భంగా రాజీవ్‌నగర్‌లోని శ్రీకోదండ రామాలయంలో స్వామివారు శుక్రవారం ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. ముక్కోటి దేవతలు శ్రీమహావిష్ణుమూర్తిని దర్శించుకునే పవిత్రమైన రోజే ముక్కోటి ఏకాదశి అని ఆలయ అర్చకులు శివరామకృష్ణశర్మ తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కండె గురవయ్య ,కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, పెద్దసంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. 64వ డివిజన్ ఎన్ఎస్‌సీ బోస్ నగర్లోని శ్రీరామాలయంలో ముక్కోటి సందర్భంగా కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ దంపతులు , భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 62వ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్‌లోని రామాలయంలో భక్తులు, ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు.



రాజీవ్‌నగర్లోని రామాలయంలో పూజలు



మాచవరం దాసాంజనేయస్వామివారి ఆలయంలో..



లెనిన్‌సెంటర్‌లోని ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

గీతామందిరంలో..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీలో ప్రసిద్ధిగాంచిన శ్రీరాధాకృష్ణ గీతా మందిరంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు. స్వామివారు ఉత్తరద్వారం నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. 11వ తేదీన 108గంగాలాలతో అమ్మవారికి పాయస నివేదన కార్యక్రమం జరుగుతుందని, 12న శ్రీరాధాకృష్ణుల మూలవిరాట్లకు ప్రత్యేక పూజలు, 13న గోదాదేవి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్త చుండూరు అన్నపూర్ణ తెలిపారు.ఆలయ కమిటీ పెద్దలు చుండూరు శ్రీనివాసరావు, నళిని తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ యూనివర్సిటీ ఏర్పాటు కోరుతూ ధర్నా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర విభజన జరిగి పదేళ్ల పూర్తయిన రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని దళిత బహుజన పరిరక్షణ సంఘం(డీబీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో డీబీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని అంబేడ్కర్ యూనివర్సిటీలో మనరాష్ట్ర విద్యార్థులను చేర్చుకోకపోతుండటంతో రాష్ట్రంలో 2లక్షల మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే అంబేడ్కర్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు జి.జోసఫ్, కె.వీరన్న, శివప్రసాద్, అమర్నాథ్, రామచంద్రరావు, ధనరాజు, కె.మాలకొండయ్య, జ్యోతి, రాజేశ్వరి, రిటైర్డ్ ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులతో ఆలయాలు కిటకిట

విజయవాడ కల్చరల్: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. . గోవిందనామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

టీటీడీ కల్యాణమండపంలో..

పున్నమ్మతోటలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం స్వామివారికి అర్చకుడు మురళీకృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. మహాసంప్రోక్షణ అనంతరం స్వామివారు ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని 20వేల మంది భక్తులు దర్శించుకోగా, క్యూలైన్లను ఆలయ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి పర్యవేక్షించారు.

లబ్బీపేటలో..

కంచికామకోటి పీఠపాలిత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 2 గంటలకు స్వామి వారికి షోడశోపచారాలతో పూజలు చేశారు. ఆయా కార్యక్రమాలను ఆలయ మేనేజర్ శర్మ పర్యవేక్షించారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

13నుంచి శక్తిపీఠం వార్షికోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక మధురానగర్ నేతాజీకాలనీలోని శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు శ్రీఅంకమ్మతల్లి శక్తిపీఠం 8వ వార్షికోత్సవాలను నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.